


(గత సంచిక తరువాయి)

**దానికి సమాధానంగా** ఆమె  నేను నీలోనే ఉన్నాను. మళ్ళీ విడిగా సెల్ఫీలు  ఎందుకు?' అంది.

కృష్ణ "దీనికంటే సంతోషం కలిగించేమాట మరొకటి లేదు. కనీసం  2020 నుండీ నువ్వు నా మనసులో ఉన్నావు. నువ్వు కోరినట్టే అఫ్ కోర్స్ నా కోరికా అదే అనుకో – నువ్వూ,  నేను మనిద్దరమే ఒంటరిగా ఎప్పుడు కలుద్దాం? నా మనసంతా విప్పి నీ ముందు పరుస్తాను. నీ వాయిస్ మెసేజ్ లు, నువ్వు నన్ను దృష్టిలో పెట్టుకుని పాడిన పాటలు, నీ సెల్ఫీలు అన్నీ నా  వద్ద భద్రంగా ఉన్నాయి. నేను వాటిని డిలీట్ చెయ్యలేదు. అవే నా ప్రాణవాయువు. పంపటం, పంపకపోవటం నీ ఇష్టం. మళ్ళీ మళ్ళీ చెపుతున్నాను. నీ ఫోటోలు, నీ గొంతు వినకపోతే నాకు జీవితం మీద ఇచ్ఛ నశిస్తుంది. నడిచే శవాన్ని నేను. ఆ ఫోటోలు చూసిన ప్రతిసారి ఈమెకు డెబ్బై ఏళ్లా? ముగ్గురు బిడ్డల తల్లా? అని ఆశ్చర్య పోతాను. మేమంతా రోజు రోజుకీ ముసలిగా కనిపిస్తుంటే నువ్వు ప్రకృతి విరుద్ధంగా యవ్వనంలోకి వెళుతున్నావ్ 36–24–36 కొలతలతో. మిసెస్ ఇండియా పోటీలకు వెళ్లు. నీతో మాట్లాడినట్టు ఏ స్త్రీతోనూ మాట్లాడలేదు. అవసరం రాలేదు. ఒక్కోసారి  నాకు భయం వేస్తుంది నేను హద్దులు దాటుతున్నానా? అని.  నేను భయపడుతున్నాను. నేను హద్దు దాటి ఏమైనా రాస్తే చెప్పు. అంతేగానీ లీవ్ ఇట్  అంటూ నీ ట్రేడ్ మార్క్ కామెంట్ పెట్టి మౌనం వహించకు.నీ స్నేహం పోగొట్టుకుని బ్రతికే శక్తి నాకు లేదు.' అని ముక్తాయించాడు.

చివరకి ఇద్దరూ గుంటూరులోనే కలవాలని నిర్ణయించుకున్నారు. ఆమె తేదీ చెప్పింది. అతను సరే నేను ఏర్పాటు చేస్తాను అన్నాడు. అతను ఎప్పుడు వెళ్లినా స్నేహితులు, అతని పూర్వ పేషెంట్లు అతనికి  ఒక చక్కని గెస్ట్ హౌస్ పెడతారు. అతనికి హోటళ్ళ అవసరం ఎప్పుడూ రాలేదు. వాళ్లందరికీ మధు తెలుసు. అందువల్ల అతను తాను అక్కడ దిగి ఎక్కడ ఆమె ఉంటుందో అక్కడికి వెళ్లి కలవొచ్చు అనుకున్నాడు. కానీ చాట్ లో మాత్రం ఎక్కడ దిగుతావో చెపితే  వచ్చి పికప్ చేసుకుంటాను. పెద్దగా ప్రైవసీ కుదరదు గానీ పర్వాలేదు అని రాశాడు. ఆమె వెంటనే ఫోను చేసింది.

"నేను ఎక్కడ దిగాలి" అని. తనకి కూడా గెస్ట్ హౌస్ లోనే బస ఏర్పాటు చేస్తాను అంటాడని ఆమె ఆశించింది.

“ఏదో ఒక హోటల్ లో దిగు. తర్వాత గెస్ట్ హౌస్ కి తీసుకు వస్తా. సాయంత్రం తీసుకు వెళ్లి నీ హోటల్ లో దింపేస్తా” అన్నాడు.

“నేను చెప్పింది నీకు అర్థం కాలేదు. సర్లే . వదిలేయ్” అని ఫోను కట్ చేసింది.

తర్వాత అతను నువ్వు రాలేదేమి అని అడిగితె టికెట్ దొరకలేదు అంది కఠినంగా. అంతేకాదు. నాలుగయిదు రోజులు ఆన్లైన్లో మాయమై పోయింది.

“నేను నీతో మాట్లాడినట్టు ఏ స్త్రీతోనూ మాట్లాడలేదు. అవసరం రాలేదు. ఒక్కోసారి నాకు భయం వేస్తుంది నేను హద్దులు దాటుతున్నానా? అని. నేను భయపడుతున్నాను. నేను హద్దు దాటి ఏమైనా రాస్తే చెప్పు. అంతేగానీ లీవ్ ఇట్ అంటూ నీ ట్రేడ్ మార్క్ కామెంట్ పెట్టి మౌనం వహించకు.నీ స్నేహం పోగొట్టుకుని బ్రతికే శక్తి నాకు లేదు.”

తర్వాత చాట్ లలో ఎన్నోసార్లు కలవాలని ప్రణాళికలు వేసుకున్నారు. ఆమెను కలిసి మాట్లాడటానికి అతనికి ఇష్టమే. అంతే కాదు ఆమెని చూడాలని పరితపిస్తున్నాడు కానీ ఏకాంతంలో కలవటానికి అతని అభ్యంతరం అతనికి ఉంది. వృత్తి రీత్యా అతనికి ప్రతి వూరిలోనూ పరిచయస్తులున్నారు. బయట కలిసి మాట్లాడటం ఆమెకి నచ్చలేదు.

కారు చిత్తూరు చేరేవరకూ భార్యాభర్తలు ఏమీ మాట్లాడుకోలేదు. టిఫిన్ తింటానికి కానీ, భోజనానికి కానీ ఎక్కడా ఆగలేదు. అక్కడ కృష్ణ చిన్ననాటి స్నేహితుడు శ్రీరామ్ వీళ్ళ కోసం బస ఏర్పాటు చేసాడు. ముగ్గురూ అక్కడికి వెళ్ళాక స్నేహితులిద్దరూ ముందు హాల్లో కూర్చున్నారు. అతని కోడలికి గుండెకు సంబంధించిన వ్యాధి ఉంది. అతను దానికి సంబంధించిన రికార్డులు, మందుల ప్రెస్క్రిపిషన్లు ముందున్న టీపాయి మీద పరిచాడు. అంత దుఃఖంలోనూ అతనిలోని వైద్యుడు అవన్నీ చాలా పరిశీలనగా చూసాడు. ఒక గంటపాటు మిత్రుడి వేదన విన్నాడు. ఆర్థికస్తోమత అంతగాలేని అతనికి తను ఉన్నానని, భాగ్యనగరంలో బసతో సహా తాను చూసుకుంటాననీ, కుటుంబమంతా వచ్చినా పర్వాలేదని భరోసా ఇచ్చాడు.

అతను వెళ్ళాక లోపలికి వస్తే మధు నిస్త్రాణంగా మంచం మీద పడి ఉంది. అతను షాక్ లో ఉన్నాడు. అతనికి ఆమె పుట్టుక గుర్తు లేదు. కానీ, ఊహ తెలిసిన నాటి నుండి తమ అనుబంధం మొత్తం కళ్ళ ముందు కదిలింది. ఏం చేశాడు తను? మధు కాలికి ముల్లు దిగితే తన గుండెల్లో గునపం దిగినట్టు బాధపడే తను ఈరోజు ఆమె నెత్తిన పెద్ద పిడుగు వేశాడు. అతను లుంగీ మార్చుకుని తన పక్కన పడుకోగానే పడగ విప్పిన తాచులా లేచింది.

పెద్దగొంతుతో “ఎప్పటినుంచీ ఈ వ్యవహారం?” అని అరిచింది.

వాక్యానికి ముందు ఒకసారి బావా అని మొదలు పెట్టి బావా అనే పిలుపుతో వాక్యం ముగించే మధు జీవితంలో మొదటిసారి అతన్ని సంభోదించలేదు.అంత షాక్ లోనూ అతను అది గమనించాడు.

“ నన్నే మీ అడక్కు మధూ! నాకేమీ గుర్తులేదు.”

"అవును నీకేమీ గుర్తు లేదు. నీకు 72 ఏళ్ళని గుర్తు లేదు, నీకు భార్య ఉందనీ గుర్తు లేదు. ఇద్దరు బిడ్డల తండ్రివనీ, ముగ్గురు మనవలకు తాతవనీ ఏమీ గుర్తులేదు." ఒకసారి నోరువిప్పాక మధు ఏమేమిటో మాట్లాడింది. అందులో అతని పట్ల కోపం కాదు – అసహ్యం, జూగుప్స, ఒక విధమైన ఏహ్యత, తన ఆవేదన ఎన్నెన్నో మిళితమై ఉన్నాయి. గమ్మత్తేమిటంటే అవతలి వ్యక్తిని ఆమె ఏమీ అనలేదు. అతను కళ్ళు మూసుకునే ఉన్నాడు. మనసులో వెయ్యి తుఫాన్లు లేస్తున్నా కళ్ళు తెరవలేదు. నోరు విప్పలేదు.

"మాట్లాడవేం? " అని ఆమె గద్దించింది.

" ఈ ప్రసక్తి వదిలేయ్. మాట్లాడతాను."

మధు విసురుగా తన సెల్ తీసుకుని ముందు హాల్లోకి వెళ్ళిపోయింది. చుట్టూ చీకటి. ఊరి చివరి బస కావటం తో నరసంచారం లేదు.

మధుకి ఫోన్లు అంటే ఇష్టం లేదు. వాళ్ళు గుంటూరునుండి భాగ్యనగరానికి మకాం మార్చాక ఇంటికి ల్యాండ్ లైను ఫోను వచ్చింది. అతను డాక్టర్ కావటం వల్ల, అప్పట్లో చాలా టైం తీసుకునే సర్కారువారు వెంటనే ఫోను అమర్చి వెళ్లారు. గుంటూరు ఇంటికి ఫోను చెయ్యటానికి, అతని అత్యవసర వైద్య సహాయం కోరేవారికోసం, పిల్లలకి వచ్చే స్నేహితుల ఫోన్లు అన్నింటికే అదే ఆధారం. చాలారోజులు చాలా మంది పాతతరం వాళ్ళలానే ఆమె సెల్ వాడకానినికి ఒప్పుకోలేదు. తర్వాత చదువుల కోసం పిల్లలు దూరంగా వెళ్లడం, కృష్ణ ఆరోగ్యం దెబ్బతినడం, అతను తరచూ స్కూలు, కాలేజీ సంవత్సరీకాలకు వెళ్లడం, ఆమెని తీసుకు వెళ్ళడానికి ఇష్టపడక పోవటం, అతనూ, తాను విహార యాత్రలకు వెళ్లడంతో ఆమెకు సెల్ వాడకం తప్పనిసరి అయింది. కృష్ణ బయటకు వెళ్ళినప్పటినుండీ తిరిగి ఇంటికి వచ్చే వరకూ దాన్ని ఒక్క క్షణమైనా విడవదు. అతను రాగానే దాన్ని డ్రాయింగ్ రూమ్ లో టీపాయ్ మీద పడేస్తుంది. ఇంకొక వాడకం కేశవ నుండి రోజు వచ్చే ఫోను. అతను ల్యాండ్ లైన్ కి చేయటానికి ఇష్టపడడు. చిన్నప్పుడు స్కూల్ లో ఆడి ఆడి ఇంటికి వచ్చి ఆ మట్టి కొట్టుకుపోయిన బట్టలతోనే ఆమెమీదపడి ఉదయం తాను బడికి వెళ్లిన దగ్గర్నుండీ తిరిగి ఇంటికి వచ్చేవరకూ ఏమి జరిగింది మొత్తం ఆమెకు చెప్పేవాడు. అతని మైండ్ సెట్ ఇప్పటికీ మారలేదు. ఆఫీస్ నుండి ఇంటికివెళుతూ తల్లితో సెల్ ఫోను లో మాట్లాడ్డం మొదలు పెడతాడు. బెంగళూరు ట్రాఫిక్ వల్ల ఇల్లుచేరాలంటే ఒక గంట పడుతుంది. ఆ గంటా ఆమెకు చాలా సంతోషం కలిగించే సమయం. అప్పుడు కూడా ఫోనుని స్పీకర్లో పెట్టి మాట్లాడుతుంది. ఈ రోజూ ఈ దుఃఖం ఎవరితో పంచుకోవాలో ఆమెకు తెలియలేదు. ఆమె ప్రపంచంలో మిగిలినవాళ్ళు ఇద్దరే. ఒకరు తనని అగాధం లోకి తోసేసిన భర్త, రెండు దూరంగా ఉన్నా తల్లితండ్రుల్ని ప్రేమించే కొడుకు.

సెల్ తీసుకుని బయటకు వచ్చాక ఒక మెసేజ్ కేశవకి ఫార్వర్డ్ చేసింది.

అది ' ఎప్పటిలానే నువ్వు అందంగా, వైబ్రెంట్ గా, ఆకర్షణీయంగా, నలభై ఏళ్ళ దానిలా వున్నావు. కీప్ ఇట్ అప్.'

అతనికి తల్లి పెట్టిన ఈ మెసేజ్ ఏమీ అర్ధం కాలేదు. సమాధానం గా అతను నాలుగు ప్రశ్న మార్కులు పెట్టాడు. తల్లి ఫిట్ నెస్ ఫ్రీక్. యోగా చేసేది. నడకకు వెళ్ళేది. బాబ్డ్ హెయిర్ తో, పంజాబీల కుర్తా, పైజమా తో, చెవులకు రకరకాల వేలాడే చెవిపోగులతో ఉండేది. అతను ఇంటర్ చదివే రోజుల్లో ఒకసారి అతని హాస్టల్ కి వెళ్ళింది. వార్డెన్ 'కేశవ్ అక్కనా మీరు? అని అడిగాడు. అతని సహవిద్యార్థులంతా 'మీ అక్క వచ్చింది రా! వార్డెన్ రూములో ఉంది' అని చెప్పారు. అతను అయోమయంగా చూడవచ్చేసరికి తల్లి వార్డెన్ ఎదురుగా కూర్చుని మాట్లాడుతున్నది. అతను చాలా అప్రసన్నంగా ముఖం పెట్టుకుని ఆమె తెచ్చిన తినుబండారాలన్నీ తీసుకు వెళ్ళిపోయాడు.

అప్పటికి మధు వయసు 43 సంవత్సరాలు. అయినా ఆమె తన వేలాడే చెవిపోగులన్నీ తీసుకు వెళ్లి లాకర్ లో పడేసింది. సింథటిక్ చీరలన్నీ  పని వాళ్ళకి ఇచ్చేసింది. చిన్న బొట్టుబిళ్ళలన్నీ పక్కకి తోసి కొంచెం పెద్ద బొట్టు బిళ్ళలు కొనుక్కుంది. జుత్తు పెంచుకుని ముడి వేయటం మొదలు పెట్టింది. తన దరి చేరటానికి ఆల్కహాల్ మానమన్నదని ఆమె పట్ల ఉదాసీనత పెంచుకున్న కృష్ణ పై మార్పులన్నీ గ్రహించలేదు కానీ జుత్తు ముడివేశాక ఆమెలోని మార్పుని స్పష్టంగా చూడగాలిగాడు.

"ఇదేంటి మధూ! ఈ అమ్మమ్మ వేషం" అన్నాడు కొంచెం అసహనంగానే. " అమ్మ వేషం"  అన్నది జవాబుగా. తరవాత ఎప్పుడో అంది.

"చిన్నప్పుడు నాన్నకి ఇష్టమని పట్టులంగాలు కట్టుకున్నాను. అవి నాకు చాలా బరువుగా అన్పించేవి. స్నేహితులందరిలానే అప్పటి ఫ్యాషన్ అయిన టెర్లిన్ బట్టలు వేసుకోవాలని ఉండేది. పెళ్లి అయ్యాక నీకు ఇష్టమని జార్జెట్ చీరెలు, పంజాబీ దుస్తులు, చెవులకు హ్యాంగింగ్స్, ఎత్తు మడమల చెప్పులు. ఎన్ని వేషాలు వేసాను బావా నీకోసం? నా కోసం నువ్వు తాగటం మానలేకపోయావు"అంది కొంచెం బిట్టర్ గానే.  ఇప్పుడు కొడుకు కోసం ఈ వేషం." అతను సమాధానం ఇవ్వలేదు. అయినా వాళ్ళిద్దరి మధ్య ప్రేమ తగ్గలేదు. అది శారీరకం కాదు.   పుట్టగానే అల్లుకుని వయసుతోపాటు బలపడిన బంధం. ఆమె వేషధారణలోని మార్పు వాళ్ళ ప్రేమకి అడ్డురాలేదు.

మళ్ళీ కేశవకి పంపిన మెసేజ్ ల దగ్గరికి వస్తే ఇంకొకటి పంపింది. ' ప్రాణమంతా నీ దగ్గరే ఉంది. నా భార్యకి ఏ సాకు చెప్పి చెన్నై రావాలో తెలియటం లేదు.' కేశవ ఆ రెండవ మెసేజ్ కూడా చూశాకా నిద్రమత్తువదిలించుకుని తల్లికి ఫోను చేశాడు. మధుకి ఎవరితోనైనా చెప్పకపోతే గుండెబద్దలు అయిపోయేలా ఉంది. ఎవరికి చెప్పుకోగలదు? ఊహ తెలిసినది మొదలు ఆమెకున్న అతి సన్నిహిత మిత్రుడు కృష్ణ ఒక్కడే!  ఈ రోజు తన జీవితాన్ని తలక్రిందులు చేసినవాడికి ఏమి చెప్తుంది? కిరాతకుడి దగ్గరకు వెళ్లి లేడికూన నువ్వు వేసిన బాణంచూడు. నాకు ఎంత గాయం చేసిందో అని చెప్పటం ఎంత హాస్యాస్పదం?

టైము చూస్తే అర్ధరాత్రి రెండున్నర గంటలు. కొడుకు నిద్ర డిస్టర్బ్ చేస్తున్నానని తెలిసి తన హృదయ భారం దించుకునేందుకు కొడుకు ఫోను ఆన్సర్ చేసింది. కేశవ దిగ్గున లేచాడు. తల్లితండ్రులు ఫోన్లు తప్ప తతిమ్మా కాంటాక్ట్స్

అన్నీ సైలెంట్ మోడ్ లోకి వెళ్ళిపోతాయి రాత్రి పది గంటల తర్వాత. వాళ్ళ వయసురీత్యా, తండ్రి ఆరోగ్య రీత్యా వాళ్ళిద్దరి ఫోన్లు మోగుతాయి. ఆమె ఫోను, మెస్సేజ్ లు చూడగానే అతని చేతులు వణికాయి. మెసేజ్ లకి ప్రాధాన్యత ఇవ్వకుండా,

"అమ్మా! నాన్న బావున్నాడు కదా! " అని అడిగాడు. అతని మనసు కీడు శంకించింది. అందరి కొడుకుల్లాగే అతనికి తన తండ్రి హీరో. అతను తన తల్లిని గౌరవించటం, ప్రేమించటం, ఆమె మాటలకి తండ్రి ఇచ్చే విలువ అవన్నీ అతనికి ఆదర్శ ప్రాయాలు. సాక్షాత్తు ఆది దంపతులే తనకి తల్లితండ్రులుగా లభించారని అతని ప్రగాఢవిశ్వాసం. నీల ప్రేమ పెళ్లి అతనికి ఏ మాత్రమూ అభ్యంతరం లేనిది. కానీ తనతండ్రికి ఇష్టం లేదు కాబట్టి అతనూ చెల్లెలితో మాట్లాడడు. నీల ఎలాగూ అమెరికాలో ఉండీఉండీ అన్ని బంధాలు మరిచిపోయింది. కనుక ఆ బంధం లేదు.

కొడుకు ఫోను చెయ్యగానే రుద్ధమైన కంఠస్వరంతో పొద్దున్న తాను, కృష్ణ బయలుదేరటం, అనుకోకుండా తను భారతి మెసేజ్ లు చదవటం, మొత్తం తన హృదయభారం తీరేదాకా గుక్క తిప్పుకోకుండా చెప్పింది. కేశవ తలతిప్పి చూస్తే అపర్ణ ప్రశాంతంగా నిద్రపోతున్నది. పిల్లలు పక్క గదిలో ఉన్నారు. అతను అయోమయంలో ఉండగానే ఆమె మాట్లాడానికి సిగ్గుపడి ఇంకో మెసేజ్ పెట్టింది. 'తన సమర్ధతను ఆమెతో పరీక్షించుకుంటాడట. ముందు ఆమె చాలా తిట్టింది. మీ నాన్న, మన దగ్గర ధీర గంభీరంగా కనిపించే నాన్న ఎంతో దీనంగా పలువిధాల ఆమెను వేడుకున్నాడు. ఎదురుగా లేదు కానీ ఉంటే ఆమె పాదాలను కన్నీళ్ళతో కడిగేవాడు. తర్వాత ఆమె మీ నాన్నని కరుణించింది. నేను నీకు సరెండర్ అయిపోయాను రాధా! అంది.

కేశవ అడ్డుపడ్డాడు. " అమ్మా! ఆగు. ఈ రాధా ఎవరు?" అతనికి చిన్న ఆశ కలిగింది ఆ చాట్ తన తండ్రిది కాదేమో! అని.

"నాన్న పూర్తి పేరు రాధాకృష్ణమోహన్ కదా!"

అతన్ని బయట వాళ్లందరూ కె ఆర్ కె ఎం అంటారు. ఇంట్లోవాళ్లకు, బంధుసమూహంలో అతను కృష్ణ. తల్లి బావా అంటుంది. ఆరోజుల్లో ఆతరం వాళ్లంతా భర్తని ఏమండీ, మీరు అంటే ఆమె బావా, నువ్వు అంటే ఎవరూ విడ్డూరంగా చూడలేదు. అలాగే అందరికీ అలవాటు అయిపోయింది. ఆడపిల్లపేరు అని అతను దాన్ని ఆర్ గా వ్యవహరించేవాడు. మెడికల్ కాలేజ్ లో ర్యాగింగ్ లో భాగంగా రాధా, రాధా అని ఏడిపించేవాళ్ళు. దాన్ని అతను ఆర్ గా మార్చేసి కృష్ణమోహన్ గా చలామణి అయినా చాలకొద్దిమంది అతన్ని అప్పట్లో రాధా అని పిలిచేవాళ్ళు అని చెప్పింది.

అతను కొంత సంబాళించుకుని, ఆంగ్లంలో " నాన్ననుండి నేనిది ఎక్సపెక్ట్ చేయలేదు." అన్నాడు. తర్వాత గుండెచిక్క బట్టుకుని " అమ్మా! నేను చిత్తూరు కి డ్రైవర్ ని పంపనా? నా దగ్గరికి వచ్చేస్తావా? ఇది నీ ఇల్లు కూడా కదా! "అన్నాడు.

"కేశవా! నాకేమీతెలియటం లేదు. నేనుషాక్ లో ఉన్నాను.ఏమీ ఆలోచించలేకున్నాను.ఇన్ని సంవత్సరాలుగాఎంతో పేరు ప్రతిష్ఠలు ఉన్నాయి. మంచి వైద్యుడిగానే కాదు. ఏ కళంకమూ లేనివాడు, ఫ్యామిలీమాన్, భార్యా విధేయుడు. ఏ పని

అయినా ఖచ్చితంగా చేస్తాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పు చేయడు. చుట్టూ ఎంతమంది అందమైన నర్సులున్నా స్త్రీల విషయంలో తను హద్దు దాటడు. ఎవరినీ దాటనివ్వడు అని మీ నాన్నకి పేరు. జీవిత చరమాంకంలో తనకి చెడ్డపేరు తేనా? గత రెండు సంవత్సరాలుగా మీ నాన్న ప్రవర్తన మారింది. సాయంత్రాలు చాలా త్వరగా క్లినిక్ కి వెళ్లిపోతున్నారు. ప్రాక్టీస్ ఎక్కువ ఉన్న రోజుల్లోకూడా సాయంత్రం ఆరుగంటలకి వెళ్లే ఆయన నాలుగింటికి, అయిదింటికి వెళ్లిపోతున్నారు –ఒక పక్క ప్రాక్టీసు తగ్గించుకున్నాను అంటూనే. నన్ను విమర్శించడు కానీ ప్రేమగానూ ఉండడు. తిండి సరిగ్గా తినడు. కూరలన్నీ కెలికి,కెలికి వదిలేస్తాడు. నాకు కోపం, విసుగు వచ్చి అరిస్తే గదిలోకి వెళ్లి, సెల్ చేతిలోనికి తీసుకుని టెక్స్ట్ చేస్తాడు. నా మీద కోపంతో నన్నేమీ అనలేక డైరీ రాసుకుంటున్నాడు అనుకున్నాకానీ ఇలా ఇంకొక స్త్రీతో చాట్ చేస్తున్నాడనుకోలేదు. ఇప్పుడు నేను ఆయన్ని వదిలి వస్తే అది తనకి ఎంత చెడ్డ పేరురా? “

” అమ్మా! నీకు పిచ్చి పట్టింది. ఇటువంటి పనులు చేస్తున్నపుడు ఆయనకి తన పేరు ప్రతిష్ఠలు గుర్తుకు రాలేదు. నీకెందుకమ్మా ఆయన గౌరవం గురించిన ఆలోచన? “

”ఒరేయ్! ఇప్పుడు మాట్లాడకపోతే నా భార్య మాట్లాడటం లేదు అని ఆమెకు ఫిర్యాదు చేస్తాడు. మాట్లాడితే దానికి చిలవలుపలవులు కల్పించి ఆమెకు టెక్స్ట్ చేస్తాడు. నా భార్య నీలా సన్నగా ఉండదు. ఇంటి పని, తోటపని అంటూ ఏదో ఒక పని చేస్తుంది. అయినా చాలా హెవీగా అయిపోయింది అని రాసాడు. అందుకే సతీ లీలావతిలా అంత పనిచేస్తుందేమో భర్తకి సన్నగా కనపడాలని అని సమాధానం ఇచ్చింది. మీ నాన్న రమేష్ అరవింద్, ఆమె హీరా, నేను కల్పన అన మాట. నా మీద నాకే అసహ్యం వేసింది.“

అసలే ఫిటినెస్ పిచ్చి తో సన్నగా ఉండే మధు, వృద్ధాప్యం వల్ల కొంత, భర్త తన మద్యపానం వదలక గుండెనొప్పికి గురై తనని నిరంతరమూ ఒక భయంలోకి తోసేసాడు అని ఆవేదనతో కొంత, తాను మద్యపానం వదలకపోతే పెదవుల ముద్దు పెట్టనివ్వను అంటే ముద్దు మానేసాడు కానీ ఆల్కహాల్ని వదలక తన ప్రాణాలమీదకు తెచ్చుకున్నాడు అనే కోపంతో కొంత మరింత సన్నగా, బలహీనంగా అయిపోయింది.

కేశవ దగ్గరగా లేకపోయినా తల్లి ఆవేదన అతని మనసుని బలంగా తాకింది.

“అమ్మా! అమ్మా! ఆ మెసేజ్ లన్నీ తీసేయ్. ఆయన్ని గురించి ఆలోచించకు. నీకేది కరెక్ట్ అనిపిస్తుందో అది చెయ్యి. ముందు నువ్వు నాదగ్గరికి బెంగళూరు వచ్చెయ్.“

”మరి మీనాన్న ఆరోగ్యం? నేను లేకపోతే ఆయన ఆహారం.......“అని అంటూండగానే కోపంతో, బాధతో అతను ఫోను కట్ చేసాడు. తన భర్త తన కంటి ముందే , తను అతని ఆరోగ్యం కోసం ఒక తపస్సులా వంట చేస్తూంటే, సేవచేస్తూంటే ఆన్లైన్లో మరొక స్త్రీతో శృంగార సంభాషణలు చేస్తున్న భర్త గురించి ఆమె నేను నీ దగ్గరకు వస్తే మరి ఆయన ఆరోగ్యం అంటూంటే కేశవకి తల్లిని ఎలా అర్థం చేసుకోవాలో తెలియలేదు.

(ముగింపు వచ్చే నెలలో)

COMMENTS